క్లుప్తంగా

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: పాపయ్యరాజుపాలెంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల 18వ వార్షికోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. విద్యార్థులు వెస్టన్, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు పట్టాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పాఠశాల ప్రెసిడెంట్ ఎల్.రమణారెడ్డి, డైరెక్టర్, ప్రిన్సిపాల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

పరవాడ: జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంకు రూ.45 లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తారని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాల పంపిణీ

సబ్బవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతులమీదుగా సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జె. చలమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని 2 వేల వరకు పట్టాలను లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు.లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

29 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండలంలోని పలు గ్రామాల్లో మద్యంతో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. వివరాలు బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన ఎం.శివాజీని 12 మద్యం సీసాలతో, గొర్లివానిపాలెంలో నరవ రామునాయుడును 5 మద్యం సీసాలతో, ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన వాసుపల్లి అమ్మోరమ్మను 12 మద్యం సీసాలతో ఆదివారం ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాత నూకరాజు

పరవాడ: మండలంలోని రావాడ శివారు జల్లెలపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి గనిశెట్టి నూకరాజు రూ.30 వేలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని గ్రామ పెద్ద వియ్యపు చిన్న కోరారు. కార్యక్రమంలో మేడిశెట్టి సోమునాయుడు, గురువునాయుడు, పితాని శ్రీనివాస్, మోటూరు విజయ్, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



గొటివాడలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని గోటివాడ అభయాంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు వడిశల లక్ష్మణ అధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆకట్టుకొంది.

చుక్కల మందుకు చక్కని స్పందన

పల్స్‌పోలియో విజయవంతం



పినగాడిలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి



చింతలగ్రహారంలో...



చినముషిడివాడలో పోలియో చుక్కలు వేస్తున్న మహేష్



సింహాచలం గ్రంథాలయం వద్ద చుక్కల మందు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడు

పెందుర్తి: నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది. పెందుర్తి గ్రామీణ మండలంలో మొత్తం 2655 మంది పిల్లలకు గాను 2578 (96శాతం)మందికి చుక్కల మందు వేశారు. ఎస్ఆర్ పురంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, పినగాడిలో సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, రాంపురంలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, గొరపల్లిలో సర్పంచ్ గొరపల్లి శ్రీను, జుత్తాడలో సర్పంచ్ బొడ్డు చంద్రవతి, గవరపాలెంలో సర్పంచ్ శ్రీను, 95వ వార్డులో కార్పొరేటర్ ముమ్మన దేముడు, చినముషిడివాడలో వైఎస్సార్‌సీపీ నేత మెంటి మహేష్ చేతుల మీదుగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు.

అడవివరం ఆరోగ్యకేంద్రం పరిధిలో శతశాతం

సింహాచలం: అడవివరం ఆరోగ్యకేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేసినట్టు ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.అప్పలనాయుడు తెలిపారు. మొత్తం 2541 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించగా దాన్ని అధిగమించి 2549 మంది చిన్నారులకు చుక్కలు మందు వేసినట్టు చెప్పారు. సింహగిరిపై 381 మంది పిల్లలకు, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 192 మందికి పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్లు గృహ సందర్శన చేసి ఎవరైనా మిగిలి పోతే పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ శ్రేష్ఠ, సిబ్బంది పి.వి.నరసింహారావు, డి.పార్వతీశం, హెల్త్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. రీజనల్ డైరెక్టర్ డాక్టర్ సుజాత ఏర్పాట్లను పరిశీలించారు.



గుల్లేపల్లి పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం మండలంలో 98 శాతం పూర్తి

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి, సబ్బవరం పీహెచ్‌సీల పరిధిలో 98 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. గుల్లేపల్లి పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్ల లోపు వారికి పోలియో చుక్కలు వేయాలని ఆమె సూచించారు. మండలంలోని సబ్బవరం,గుల్లేపల్లి పీహెచ్‌సీల పరిధిలో 4,780 మంది చిన్నారులకు గాను 4,684 మందికి పోలియో చుక్కలు వేయించినట్లు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి తెలిపారు. మిగిలిన చిన్నారులందరికీ సోమ,మంగళవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు.



సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

పరవాడ మండలంలో..

పరవాడ: మండలంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. వాడచీపురుపల్లి, పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 96 శాతం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగిందని వైద్యాధికారులు కనకప్పారావు, హారిక తెలిపారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో 1782 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించగా 1510 మందికి వేసినట్టు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు చెప్పారు.

- పరవాడ పీహెచ్‌సీ పరిధిలో 1548 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించగా 1423 మంది చిన్నారులకు వేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక చెప్పారు. 20 మంది ప్రయాణికులు, 49 మంది ఇటుక బట్టీల ప్రాంతాల్లో ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని సోమవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని హారిక తెలిపారు.
- సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్‌లో జీవన్ రేఖా ఆస్పత్రిలో ఏర్పాటు పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు.
- ముత్యాలమ్మపాలెంలో సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.
- ముత్యాలమ్మపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



వాడచీపురుపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు కనకప్పారావు



పరవాడలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యురాలు హారిక



దీపాంజలినగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా

కొలువుదీరిన కోదండరాముడు



విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న భక్తులు



సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కోట్నివానిపాలెంలో ఆధ్యాత్మిక సందడి

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో కోదండరాముడు కొలువుదీరాడు. గ్రామంలో నూతంగా నిర్మించిన రామాలయంలో సంపత్ వినాయక పూర్వక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ఠ వేద మంత్రోచ్ఛరణల నడుమ చేశారు. అనంతరం సీతారాములు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో దాదాపు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శాంతికల్యాణం వైభవంగా జరిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పంచకర్ల రమేష్‌బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి కనకరాజు దంపతులు, ఎంపీపీ మధుపాడ నాగమణి, అంజి దంపతులు, వైస్ ఎంపీపీలు చిరికి దేముడు, దాడి వరలక్ష్మి, అర్జున దంపతులు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను, మామిడి శంకర్రావు, బొడ్డు చంద్రవతి, ప్రకాష్ దంపతులు, నాయకులు సబ్బవరపు ఈశ్వరరావు, బయిలపూడి హరగోపాల్ సీతారాములను దర్శించుకున్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మకత వెలుగులోకి..



నమూనాను తిలకిస్తున్న సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవిద్య



నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థి

సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష

సింహాచలం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష తెలిపారు. 98వ వార్డు అడవివరంలోని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ సైన్స్‌పైనే దేశ పురోగతి ఆధారపడి ఉందన్నారు. కరోనా వంటి కష్టకాలంలో భారత శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ తయారు చేసి ఎన్నో దేశాలకు అందించారన్నారు. సాంకేతికను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ భార్గవి నాయక్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం ఎంతో ముందంజలో ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన మొక్కల్లోని భాగాలు, రుతువులు, సింపిల్ సర్క్యూట్, ప్రథమ చికిత్స, వాయు కాలుష్యం, జీవితచక్రం తదితర 20 నమూనాలు ఆకట్టుకున్నాయి. మౌంట్ డియోస్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు, ముత్తంశెట్టి విజయనిర్మల, పాఠశాల సీఈవో ముత్తంశెట్టి అఖిలప్రియ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవిద్య పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్టింపజేసి అష్టోత్తర శతనామవళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామికి హారతులు అందజేశారు.

యువత అప్రమత్తంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: యువత సైబర్ క్రైం, రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. తాడి గ్రామంలో ఆదివారం యువతకు ఈవ్‌టీజింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ బాల సూర్యారావు మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో యువత ఎటువంటి గొడవల్లో తలదూర్చవద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అంతా సహకరించాలని సీఐ బాలసూర్యారావు కోరారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

ముగ్గురిని కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ముగ్గురిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారు. విశాఖ బర్మాకాలనీకి చెందిన 60 ఏళ్ల నక్కా లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా మనస్తాపంతో ఆర్.కె.బీచ్‌లో దిగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. రుషికొండ బీచ్‌లో శనివారం సముద్రంలో చిక్కుకున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ జె.హరీష్, ఎం.నవీన్, టి.పోలిరాజు, ఓ.రాజు, జి.చిన్న, అప్పన్న, కె.రాజు రక్షించి ప్రాణాలు కాపాడారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ సందర్భంగా అభినందించారు. శివరాత్రికి సముద్ర స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా ప్రమాదాలు సంభవించకుండా జీవీఎంసీ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. బీచ్‌లో ప్రత్యేక రోబోటిక్ యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.



బర్మాకాలనీకి చెందిన వృద్ధురాలిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

140 ఎపిసోడ్‌లతో 'ఘంటసాల గాన మాధుర్యం'

ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ శరత్‌చంద్ర

దాబాగార్డెన్స్: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడల్ గంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక నిర్వహించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, అమెరికాకు చెందిన జి.రాము, ఎన్నారై కె.సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వయసు గల ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గాయనీగాయకులు పాల్గొని పాటలు పాడారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ ప్రసారమాధ్యమాల ద్వారా 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందని డాక్టర్ శరత్ చంద్ర ఈ సందర్భంగా తెలిపారు. వి.రాజేంద్రప్రసాద్, జీవీఎంసీ సెక్రటరీ పి.నల్లనయ్య, సుబ్రహ్మణ్య శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్ప రాధ, నిర్వాహకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వంకాయల సన్యాసిరాజు

నేడు ఐడల్ గంధర్వ లోగో ఆవిష్కరణ

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉత్తరాంధ్ర ఘంటసాల స్మారకపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర నేతృత్వంలో ఐడల్ గంధర్వ లోగోను సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వరాభిషేకం, పాడుతా తీయగా గాయనీగాయకులతో సినీ సంగీత విభావరి, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ధ్వని అనుకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జి.రాముకి జీవిత సాఫల్య పురస్కారాన్ని సుమన్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

పోరాటాలతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,116వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో అనేక మంది ప్రధాన మంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ పేదల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

అపూర్వ కలయిక



గాజువాక హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 2004లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామంతా అసోసియేషన్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సహచర మిత్రులకు ఆర్థిక సాయం చేస్తున్నామని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ముందుగా తమతో కలసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తిని ఘనంగా సత్కరించారు.